
చంద్రబాబుకు జ్ఞాపిక అందజేస్తున్న అరవింద్‌కుమార్‌గౌడ్ తదితరులు

నగర తమ్ముళ్లలో నూతనోత్తేజం

రాంనగర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో టీడీపీకి పూర్వవైభవం తీసుకువస్తామని టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ప్రకటించడం హర్షణీయం అని టీడీపీ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు ఎం.అరవింద్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం ఎన్టీఆర్ ట్రస్ట్‌భవన్‌లో చంద్రబాబునాయుడును టీడీపీ నగర కమిటీ తరపున అరవింద్‌కుమార్‌గౌడ్, నగర అధ్యక్షుడు పి.సాయిబాబా, ప్రధాన కార్యదర్శులు నల్లెలకిషోర్, పి.బాల్‌రాజ్‌గౌడ్ ఆధ్వర్యంలో పలువురు టీడీపీ నేతలు కలిసి జ్ఞాపికను అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అరవిందక్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ టీడీపీకి నూతన యువరక్తం ఎక్కిస్తామని చంద్రబాబు చేసిన ప్రకటనతో తెలంగాణలోని నాయకులు, కార్యకర్తలకునూతనోత్తేజం వస్తుందన్నారు. రాష్ట్రంలో పూర్వవైభవం రావడంకోసం పార్టీ కార్యకర్తలు సన్నద్ధం కావాలన్నారు. విభజన హామీల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో చంద్రబాబు భేటీ కావడం మంచి పరిణామన్నారు.

విదేశీ విద్యా రుణాలు మంజూరు చేయాలి

● కేంద్ర మాజీమంత్రి వేణుగోపాలచారి

రాంనగర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): విదేశీ విద్యా రుణాలు మంజూరు చేయాలని కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాల చారి సీఎం రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. ఈ మేరకు బ్రాహ్మిణీస్ బిజినెస్ నెట్‌వర్క్(బీబీఎన్). తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య ప్రాంతీయ కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టుకార్డు ఉద్యమాన్ని ఆదివారం నారాయణగూడలో నిర్వహించంగా, ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. విదేశాలలో ఉన్నత చదువులకు వెళ్లాలని, ప్రభుత్వ ఆర్థికసహకారం కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ ప్రభుత్వం ఆర్థికసహకారం అందించాలన్నారు. ఇందుకోసం ప్రత్యేక బడ్జెట్‌ను విడుదల చేయాలని సీఎంను కోరారు. ప్రతి ఒక్కరూ రేవంత్‌రెడ్డికి పోస్టుకార్డుల ద్వారా తమ డిమాండ్లను తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో బీబీఎన్ సంస్థ ప్రధాన కార్యదర్శి విక్రమ్, ప్రతినిధులు బీఎస్ఎన్.మూర్తి, నేపల్లి శశిధర్ తదితరులు పాల్గొన్నారు.


సీఎంకు పోస్టుకార్డును పంపిస్తున్న వేణుగోపాలచారి, బ్రాహ్మణ సంఘాలు

పార్టీ ఫిరాయింపులను సీఎం ప్రోత్సహించడం తగదు

● బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు

రాంనగర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలు పట్టించుకోని సీఎం రేవంత్‌రెడ్డి.. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడం తగదని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు అన్నారు. ఆదివారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి తాజా రాజకీయాలు, ఫిరాయింపులపై చర్చించారు. అనంతరం ఎమ్మెన్ విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో సీఎం రేవంత్‌రెడ్డి విఫలమయ్యారని విమర్శించారు. వాటిని కప్పిపుచ్చుకోవడానికి ప్రతిపక్ష ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను కాంగ్రెస్‌లో చేర్చుకోవడం రాజకీయ దివాళా కోరుతనానికి నిదర్శనమన్నారు. నగరంలో శాంతిభద్రతలు క్షీణించాయని, పారిశుధ్యం, అంటూ వ్యాధుల సమస్యలను అధికారులు, మంత్రులు, సీఎం పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ పార్టీకి బలమైన నాయకత్వం ఉందని, ఎమ్మెల్యేలు పార్టీ మారినా.. కార్యకర్తల బలం ఉందన్నారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో పార్టీ నాయకులు రజనీకాంత్‌గౌడ్, ముప్పిడి నర్సింగ్‌రావు తదితరులున్నారు.


బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో శ్రీనివాసరావు


కృపారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అభిషేక్ కెన్నడీ తదితరులు

కాంగ్రెస్‌కు.. కృపారావు సేవలు మరువలేనివి

చిక్కడపల్లి, జూలై 7(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ నగర మాజీ అధ్యక్షుడు ఎస్ కృపారావు జయంతిని గాంధీనగర్ డివిజన్‌లో ఘనంగా నిర్వహించారు. ఆదివారం గాంధీనగర్ వై జంక్షన్‌వద్ద ఆయన మనుమడు, గాంధీనగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అభిషేక్ కెన్నడీ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. కృపారావు చిన్న కుమారుడు కన్నా డేనియల్, కాంగ్రెస్ నాయకులు మారిశెట్టి నర్సింగ్‌రావు, జహీరుద్దీన్, సుబ్బారావు, జగదీష్‌బాబు, దినేష్ తదితరులు కృపారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పేదలకు అల్పాహారం పంపిణీ చేశారు. కృపారావు కాంగ్రెస్ పార్టీ చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. కృపారావు కాంగ్రెస్ నాయకుడుగా, సామాజిక సేవకుడిగా పేదలకు ఇళ్లు ఇప్పించాడానికి ఎంతో కృషి చేశాడని అన్నారు.

ఆటో డ్రైవర్ల డిమాండ్లను పరిష్కరించాలి

● ఆగస్టు 1న నగరంలో ఆటోల బంద్: షేక్‌హ్యాండ్ జేఏసీ

నల్లకుంట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఆటోడ్రైవర్ల న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని షేక్ హ్యాండ్ తెలంగాణ ఆటో డ్రైవర్స్ జేఏసీ కన్వీనర్ మహ్మద్ అమానుల్లాఖాన్ డిమాండ్ చేశారు. దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న తమ డిమాండ్ల పరిష్కారానికి ఆగస్టు 1న నగరంలో ఆటోల బంద్ నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఆదివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆటోమీటరు చార్జీలు 10 ఏళ్లల్లో పెంచకపోవడానికి వ్యతిరేకంగా నిరసన ఆటోల బంద్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పొరుగు రాష్ట్రాలతో సమానంగా ఆటో మీటరు చార్జీలను పెంచాలని, ఆటోడ్రైవర్లకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో షేక్ హ్యాండ్ తెలంగాణ ఆటోడ్రైవర్స్ జేఏసీ నేతలు ఆంజనేయులు, మహమూద్ హష్మీ, మహబూబ్, అక్తర్‌బాయ్, షేక్ షరీఫ్, షేర్ రహీం, రజాక్, రమేష్, అజీముద్దీన్, లతీఫ్‌బాయ్, మధుకర్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలనూ అమలు చేయాలి

ఏడు నెలల్లో ఫ్రీ బస్సు ఒక్కటే అమలు: బస్తీబాటలో సీపీఎం నాయకులు


వీకర్ సెక్షన్‌కాలనీలో ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న సీపీఎం పార్టీ అంబర్‌పేట జోన్ కన్వీనర్ మహేందర్

గోల్నాక, జూలై 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడు నెలలు పూర్తయినా ఇంతవరకు ఏఒక్క హామీ పూర్తిగా అమలు చేయలేదని, మహిళలకు ఆర్టీసీ ఫ్రీ బస్సు మినహాయిస్తే చేసిందేమీ లేదని సీపీఎం పార్టీ అంబర్‌పేట జోన్ కన్వీనర్ ఎం. మహేందర్ విమర్శించారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు రూ.2500ల ఆర్థిక సహాయం, ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ రూ.500లు, కల్యాణలక్ష్మి, వృద్ధులకు రూ.4000 పెన్షన్, దివ్యాంగులకు రూ.6000ల పెన్షన్ పథకాలు ఇంకా అమలు చేయలేదన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి సీపీఎం నాయకులు ఆదివారం బస్తీబాట కార్యక్రమం నిర్వహించారు. అంబర్‌పేట నియోజకవర్గంలోని బాగ్‌అంబర్‌పేట డివిజన్ వాకర్‌సెక్షన్ కాలనీ, బతుకమ్మకుంట, గంగాబౌలి, మల్లన్నగుడి లైన్ తదితర ప్రాంతాలలో బస్తీబాట కార్యక్రమం నిర్వహించారు. ప్రజలను కలుసుకుని ఏడు నెలల కాంగ్రెస్ పాలనలో ఇచ్చిన హామీలు అమలవుతున్నాయా అవి మీకు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎం.మహేందర్ మాట్లాడుతూ బస్తీలలో డ్రైనేజీ, మంచినీటి, వీధిదీపాలు, రోడ్లు తదితర సమస్యలతో ప్రజలు బాధపడుతున్నారన్నారు. సంక్షేమ పథకాల అమలుకు తెల్లరేషన్‌కార్డు లింక్ చేయడంతో రేషన్‌కార్డు లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతన్నారని, గృహలక్ష్మి పథకం కింద ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇంతవరకు వాటి విధివిధానాలను రూపొందించకపోవడంతో దరఖాస్తులు చేసుకున్న పేదలు ఇళ్ల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలనూ తక్షణమే అమలు చేయాలని లేనిపక్షంలో ప్రజలను పెద్దఎత్తున సమీకరించి ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ జోన్ కమిటీ సభ్యులు జి.రాములు, బి.సుబ్బారావు, నాయకులు శ్రీనివాస్, మల్లికార్జున్, గోపీ తదితరులు పాల్గొన్నారు.

'క్రాంతి నగర్ బస్తీ వాసులకు ఇళ్ల పట్టాలను ఇవ్వాలి'

ముషీరాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): క్రాంతినగర్ బస్తీ వాసులకు వెంటనే ఇళ్ల పట్టాలను ఇవ్వాలని సీపీఎం నగర కార్యవర్గదర్శి సభ్యులు దశరథ్ డిమాండ్ చేశారు. ఆదివారం బోలక్‌పూర్ డివిజన్‌లోని క్రాంతి నగర్‌లో సీపీఎం పార్టీ నాయకులు బస్తీబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానికంగా ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేసి, వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా దశరథ్ మాట్లాడుతూ జీవో 58 ప్రకారం స్థానికులకు వెంటనే ఇళ్ల పట్టాలు ఇవ్వాలన్న ఆయన, సొంత ఇళ్లు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు పొందలేకపోతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శులు శ్రీనివాస్, నర్సింగ్‌రావు, నాయకులు వెంకటయ్య, కృష్ణస్వామి, ఎస్. శ్రీనివాస్, జి. కృష్ణ, శివశంకర్, లక్ష్మి పాల్గొన్నారు.

రాష్ట్రంలోని ఎరుకల జాతిని సీఎం రేవంత్‌రెడ్డి దత్తత తీసుకోవాలి

బర్కత్‌పుర, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఎరుకల జాతిని సీఎం రేవంత్‌రెడ్డి దత్తత తీసుకోవాలని తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు విజ్ఞప్తి చేశారు. ఎరుకల జాతి సంక్షేమానికి ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటుకు రేవంత్‌రెడ్డి ఎంతో కృషి చేశారన్న ఆయన, రాష్ట్రంలోని ఎరుకల జాతి అంతా సీఎం రేవంత్‌రెడ్డికి రుణపడి ఉందన్నారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 10 లక్షల ఎరుకల జాతి నివసిస్తుందని, వారు పూర్తిగా అభివృద్ధి సాధించాలంటే సీఎం రేవంత్‌రెడ్డి ఎరుకల జాతిని దత్తత తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలోని ఎరుకల జాతి ఇదే కోరుకుంటుందన్నారు. ఏకలవ్య కార్పొరేషన్‌కు వెంటనే పాలకమండలిని ఏర్పాటు చేసి రూ. 500 కోట్ల బడ్జెట్ కేటాయించాలని కోరారు. కార్పొరేషన్ చైర్మన్‌గా అనుభవం ఉన్న ఎరుకల జాతి విద్యావంతులు, మేధావులను నియమించాలన్నారు. ఎస్టీ కార్పొరేషన్‌లో ఇతర సామాజిక వర్గానికి చెందిన కమిషనర్లు ఉన్నారని ఎస్టీ సామాజికవర్గానికి చెందిన వారిని నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోనేటి నర్సింహ, రవికుమార్, వనం రమేష్, శ్రీరామ్‌సదానందం, శ్రీరామ ఆనంద్, పాతపల్లి నర్సింహ, నాగులు, మొగులయ్య, ఎల్లయ్య, సాయిరామ్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజు

తెలంగాణ స్త్రీ సేవా సంస్థ ఆవిర్భావం

రాంనగర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. తెలంగాణ సీనియర్ సిటిజన్స్ సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ స్త్రీ సేవా సంస్థ ఆవిర్భావం జరిగింది. సంస్థ నూతన అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ శోభాపేరిందేవి, హేమలత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి అతిథులుగా భీమన్న సాహితీనిధి సంస్థ చైర్మన్ బోయి హైమావతి భీమన్న, తెలుగు రాష్ట్రాల యాక్టింగ్ ఇన్‌చార్జి యాతీంద్రయాదవ్, తెలంగాణ స్టేట్ సీనియర్ సిటిజన్స్ కాన్ఫడరేషన్ అధ్యక్షుడు సి.రాంచంద్రయ్య, అభినందన డాక్టర్ ఇ.భవానీ, విశ్రాంత సీనియర్ మెడికల్ ఆఫీసర్ వెంకట్రామ్ రెడ్డి, ఏవీ రావు, ప్రకాష్‌రెడ్డి, స్త్రీసేవా సంస్థ ఉపాధ్యక్షురాలు భ్రమరాంబ, సంయుక్తకార్యదర్శి సంధ్య, కోశాధికారి శైలజ తదితరులు హాజరయ్యారు.

కనులవిందుగా సినీగీతాలాపన

చిక్కడపల్లి, జూలై 7(ఆంధ్రజ్యోతి): సుమాస్ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం త్యాగరాయగాన సభలో అన్నమయ్య కళాసమితి వ్యవస్థాపకులు గండేపల్లి సుమలత ఆధ్వర్యంలో 'సినీగీతాల ఆలాపన' కార్యక్రమం జరిగింది. 15 మంది చిన్నారులు ముక్త, ధాత్రి, అచ్యుత, కృష్ణ అద్వైత, మాన్య, అభిజిత్ కార్తికేయ, సాయిశ్రేష్ఠ, సాయివైభవి, విశ్వతేజారావు, రిషిత, నాగలక్ష్మి, పర్ణిక, సాధ్వి, రేఖాతన్వి, అక్షయ, యశోజ్ఞ పాల్గొని అలనాటి సుమధుర గీతాలు 'వేణుగానమ్ము వినిపించెనే', 'పాడుతా తీయగా', 'బూచాడమ్మ బూచాడు', 'పగలే వెన్నెల','వటపత్ర సాయికి', 'అందరి బంధువయ' తదితర పాత పాటలను ఆలపించి వీక్షకులకు కనులవిందు చేశారు. కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వి. జీవన్ వ్యవహరించగా ముఖ్యఅతిథిగా ప్రముఖ సంగీత దర్శకులు స్వరవీణాపాణి, విశిష్ట అతిథిగా సంగీత దర్శకులు, సినీ నేపథ్యగాయకులు పి. రవివర్మ, పి. గిరిధర్‌రావు, ఉషారాణి, విజయలక్ష్మి పాల్గొని చిన్నారులను అభినందించారు.



క్వీనీ విక్టోరియాను సత్కరిస్తున్న అభిమానులు

నా రికార్డును
తెలుగు రాష్ట్రాల సీఎంలకు అంకితం

బర్కత్‌పుర, జూలై 7 (ఆంధ్రజ్యోతి): తాను సాధించిన రికార్డును రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు అంకితం చేస్తున్నానని అంతర్జాతీయ పిన్ స్విమ్మర్ క్వీనీ విక్టోరియా చెప్పారు. భారత్ తరపున వెళ్లిన క్వీనీ విక్టోరియా గత నెల (జూన్) 24, 24 తేదీల్లో స్విమ్ ఎవరెస్ట్‌గా పిలువబడుతున్న ఇంగ్లిష్ చానల్‌ను 71 కిలో మీటర్ల క్రాస్ స్విమ్మింగ్ చేసి 16 గంటల 55 నిముషాలలో ఈది రికార్డు సృష్టించింది. నగరానికి వచ్చిన క్వీనీ విక్టోరియా ఆదివారం పలువురు అభిమానులు సత్కరించారు. ఇంగ్లండ్‌లోని డోవర్‌కోస్టు నుంచి రిలే స్విమ్మింగ్ ప్రారంభించి ఫ్రాన్స్ దేశంలోని ఫ్రెంచ్ కోస్టుకు వరకూ ఈదడం జరిగిందని' క్వీనీ విక్టోరియా తెలిపారు.

బోనాల నిర్వహణకు
రూ. 10 లక్షల నిధులు కేటాయించాలి

● మంత్రికి మహంకాళీ ఆలయ కమిటీ ప్రతినిధుల వినతి

రాంనగర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం బోనాల నిర్వహణ కోసం రూ.10 లక్షల నిధులు కేటాయించాలని అంబర్‌పేట శ్రీమహంకాళీ ఆలయ కమిటీ ప్రతినిధులు కోరారు. ఆదివారం రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కలిసి వినతిపత్రం అందజేశారు. సందర్భంగా ఆలయ కమిటీ సలహాదారులు కె.దుర్గాప్రసాద్‌రెడ్డి, అధ్యక్షుడు వై. శంకర్‌గౌడ్, ఉపాధ్యక్షులు రంగంపల్లి రాజు, కార్యనిర్వహణకార్యదర్శి కిషోర్, కార్యదర్శి సుధాకర్, కోశాధికారి గడ్డం శ్రీధర్‌గౌడ్, ఫైనాన్స్ కమిటీ కన్వీనర్ గిరిధర్‌గౌడ్ మాట్లాడుతూ బోనాల ఉత్సవాలకు దేవాదాయ శాఖ పరంగా తగిన ఏర్పాట్లు చేయాలని మంత్రిని కోరారు. బోనాల కోసం నిధుల కేటాయింపుకు సహకరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలి

● బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతమ్‌రావు

రాంనగర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): వాతావరణ కాలుష్య నివారణ కోసం ప్రతిఒక్కరు విధిగా మొక్కలు నాటాలని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతమ్‌రావు పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఉమాశంకర్; రాష్ట్ర కార్యవర్గసభ్యులు పి. గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో డీడీకాలనీ జలమండలి కార్యాలయం ఆవరణలో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన గౌతమ్‌రావు మొక్కలునాటి మాట్లాడారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు విధిగా తమ మాతృమూర్తుల పేరిట మొక్కలునాటాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు డాక్టర్ హరిచరణ్, పుట్ట పాండురంగయ్య, ప్రొఫెసర్ రాజిరెడ్డి, రాంరెడ్డి, భాస్కర్, హర్షవర్ధన్ రెడ్డి, బలవంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ట్యాంక్‌బండ్‌పైన, గోల్కొండ కోటలో
సర్దార్ పాపన్న విగ్రహాలను ఏర్పాటు చేయాలి'

రాంనగర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ట్యాంక్‌బండ్‌పైన, గోల్కొండ కోటలో సర్దార్ పాపన్న విగ్రహం ఏర్పాటు చేయాలని తెలంగాణ గౌడ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తొలుపునూరి రమేష్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ గౌడ సమితి సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో గౌడ కులస్థులకు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. సర్దార్ పాపన్న జయంతి వరకు ట్యాంక్‌బండ్, గోల్కొండ కోటలో విగ్రహాలను ఏర్పాటు చేయాలన్నారు. ఆర్థికంగా వెనుకబడిన గౌడకులస్థులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. సదస్సులో నాయకులునరేష్‌గౌడ్, చంద్రం, అరవింద్‌గౌడ్, రాజుగౌడ్, వినోద్‌గౌడ్, జంగయ్యగౌడ్; నాగరాజుగౌడ్, సత్యంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


అబిడ్స్ ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని ఎన్టీఆర్ స్టేడియం వద్ద నిర్వహించిన జగన్నాథ రథయాత్రలో భక్తులు

- ఫొటో ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్

కులాంతర మతాంతర వివాహాలు చేసుకున్న
ఆదర్శ దంపతుల పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

రాంనగర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : కులాంతర మతాంతర వివాహాలు చేసుకున్న ఆదర్శ దంపతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. అర్హులైన కులాంతర, మతాంతర వివాహాలు చేసుకున్న దంపతులకు పురస్కారాలు అందజేస్తామన్నారు. ఆదర్శ వివాహాలను ప్రోత్సహించడం కోసం ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో ఈ నెల 14న ఆదివారం సాయంత్రం సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో దంపతులకు ఆదర్శ దంపతులకు పురస్కారాలు ప్రదానం చేస్తామని ఆ సంస్థ నిర్వాహకులు ఇ.సూర్యసుధ, ఇ.స్మృతిసూర్యవంశీ, ఇ.సూర్యతేజ సుబ్రాంత్ మాస్టర్లు తెలిపారు. అర్హులైన కులాంతర మతాంతర వివాహాల దంపతులు ఈ నెల 10వ తేదీలోపు ఇరువురి ఫుల్‌సైజ్ ఫొటో, వివాహ తేదీ వివరాలు, వాట్సాప్‌లో దరఖాస్తులు 9652347207 పంపించాలని వారు కోరారు.

ఏఐసీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా గిడియోన్ బాబు

చిక్కడపల్లి, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్ (ఏఐసీఎఫ్) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకే గిడియోన్‌బాబు ఎన్నికయ్యారు. ఏఐసీఎఫ్ తెలంగాణ రాష్ట్ర సర్వసభ్య సమావేశం అమృతవాణి నిలయంలో ఆదివారం జరిగింది. సమావేశంలో నూతన రాష్ట్ర అధ్యక్షుడిగా గిడియోన్ బాబును ఎన్నుకొన్నారు. రాష్ట్రంలోని క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి, దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కోసం కూడా కృషి చేస్తానని గిడియోన్ బాబు తెలిపారు.


గిడియోన్ బాబు

కాచిగూడ సీఐగా చంద్రకుమార్ బాధ్యతలు స్వీకరణ

బర్కత్‌పుర, జూలై 7 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రలకు ప్రజలు సహకరించాలని కాచిగూడ సీఐ చంద్రకుమార్ కోరారు. మొహర్రం, బోనాల వేడుకలను ప్రజలు శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సీఐ లక్ష్మీకాంత్ రెడ్డి బదిలీ కావడంతో ఆయన స్థానంలో సౌత్ జోన్ ఎస్‌బీలో సీఐగా విధులు నిర్వహిస్తున్న చంద్రకుమార్ కాచిగూడకు బదిలీ చేశారు. ఆదివారం కాచిగూడ పోలీస్ స్టేషన్‌లో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో ఎలాంటి సమస్యలు ఉన్నా ప్రజలు తమ దృష్టికి తీసుకురావాలన్నారు.


సీఐ చంద్రకుమార్

గ్రేటర్‌లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలి

● టీపీసీసీ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌యాదవ్

బర్కత్‌పుర, జూలై 7 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆర్. లక్ష్మణ్‌యాదవ్ కార్యకర్తలకు సూచించారు. అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన తొలుపునూరి కృష్ణగౌడ్‌ను నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఘనంగా సత్కరించారు. ఆరు గ్యారంటీల పథకాలపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను తిప్పికొట్టాలని సూచించారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి లక్‌పతి యాదగిరిగౌడ్, లేబర్ కోర్టు మాజీ చైర్మన్ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

● ఐఏఎస్ అధికారి నామిని వెంకటేశం

బర్కత్‌పుర, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఐఏఎస్ అధికారి నామిని వెంకటేశం సూచించారు. ఆదివారం బర్కత్‌పురలోని లీల్జీ పారా క్లినిక్‌లో సేవాయూత్ అధ్యక్షుడు రచ్చ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మధుమేహ వైద్య శిబిరాన్ని వెంకటేశం ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. ఆహార అలవాట్లలో మార్పుల వల్ల చాలామంది మధుమేహం వ్యాధికి గురవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఐఏఎస్ అధికారి చిరంజీవి, డాక్టర్ టి. సృజన తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలి

● మున్నూరుకాపు ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ వెంకట్రావ్

బర్కత్‌పుర, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మున్నూరుకాపు మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ వెంకట్రావ్ అన్నారు. మహిళలు అభివృద్ధి సాధించినప్పుడే మహిళాసాధికారత సాధ్యమవుతుందని, కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ఆదివారం కాచిగూడలోని మున్నూరుకాపు భవన్‌లో తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన ప్రారంభించి మాట్లాడారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా అందివచ్చిన అవకాశాలను పుణికిపుచ్చుకోవాలన్నారు. సందర్భంగా మహిళలకు వంటల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో మహాసభ మహిళా కమిటీ అధ్యక్షురాలు చామకూర సుజాత, అడ్వకేట్ అన్నపూర్ణ, ఆకుల మంజుల, ట్రస్ట్ బోర్డు సభ్యులు పన్నాల విష్ణువర్ధన్, దేవేందర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తాళాలు పగులగొట్టి విల్లా.. గుల్ల

● 40తులాల బంగారం, లక్ష నగదు అపహరణ

కొత్తపేట, జూలై 7(ఆంధ్రజ్యోతి): నగర శివారు ఫతుల్లాగూడ గేటెడ్ కమ్యూనిటీలోని ఓ విల్లాలో శనివారం అర్ధరాత్రి దొంగలు పడ్డారు. ఇంటి తాళాలు పగులగొట్టి 40 తులాల బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదును దోచుకెళ్లారు. నాగోలు ఎస్‌హెచ్‌ఓ సుధీర్‌కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఫతుల్లాగూడలోని గోల్డెన్ లీవ్స్ విల్లాస్ గేటెడ్ కమ్యూనిటీలోని నెం.89 విల్లాలో విశ్రాంత పోస్టల్ ఉద్యోగి పురుషోత్తంరెడ్డి కుటుంబ సభ్యులతో ఉంటున్నారు. ఇటీవలే కుమార్తె విదేశాల నుంచి రావడంతో అందరూ కలిసి ఈనెల 3న పుణ్యక్షేత్రాల దర్శనానికి వెళ్లారు. మరో విల్లా (నెం.22)లో ఉంటున్న నీరజారెడ్డి కుటుంబ సభ్యులు కూడా బంధువుల ఇంటికి వెళ్లారు. అయితే, శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు నంబర్ 89 విల్లా తాళాలు పగులగొట్టి బెడ్‌రూంలోని కప్‌బోర్డులో దాచిన 40 తులాల బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదు ఎత్తుకెళ్లారు. ఆదివారం ఉదయం ఇంటికి చేరుకున్న పురుషోత్తంరెడ్డి ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడం చూసి చోరీ జరిగినట్లుగా అనుమానించి కమ్యూటీ అసోసియేషన్ వారి సహకారంతో నాగోల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎల్బీనగర్ జోన్ డీసీపీ ప్రవీణ్ కుమార్, ఏసీపీ కృష్ణయ్య, అడిషనల్ డీసీపీ క్రైమ్స్ శ్రీనివాస్, పోలీసు జాగిలాలు, క్లూస్ టీం, వేలిముద్రల నిపుణులు ఘటనా స్థలానికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. విల్లా ఎదురుగా ఉన్న సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించగా ఇద్దరు యువకులు చోరీచేసి వెళుతున్న దృశ్యాలు అందులో రికార్డయ్యాయి.

పనిచేయని సీసీ కెమెరాలు..

ఈ గేటెడ్ కమ్యూనిటీలో 54 సీసీ కెమెరాలు పనిచేయడం లేదని పోలీసులు గుర్తించారు. విల్లాల వెనుక మూసీ వైపు ఖాళీ ప్రదేశం ఉండడంతో ప్రహరీని సులభంగా దూకి దుండగులు లోనికి ప్రవేశించి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. చోరీచేసి పరారయిన దుండగులను పట్టుకునేందుకు ప్రత్యేకంగా 3 సీసీయస్ పోలీసుల బృందాలు, 3 ఎల్బీనగర్ జోన్ బృందాలు రంగంలోకి దిగాయని సమాచారం. ఇటీవలే కొత్తగూడెం వద్ద పార్థీగ్యాంగ్ సభ్యుల్లో ఇద్దరిని నల్లగొండ పోలీసులు పట్టుకున్న సంఘటనను పలువురు గుర్తు చేసుకుంటున్నారు. ఆ గ్యాంగ్‌లోని మిగతా సభ్యులే గేటెడ్ కమ్యూనిటీ విల్లాలో చోరీ చేసి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. ఈ గేటెడ్ కమ్యూనిటీలో చోరీ తీరుమాత్రం అందుకు భిన్నంగా ఉందని పోలీసుల అధికారులు అభిప్రాయపడుతున్నారు.

మందకృష్ణ మాదిగతో.. మాదిగలకు న్యాయం జరగలేదు

● జూలై 7ను మాదిగ అమరవీరుల సంస్మరణ దినంగా పాటించాలి

కవాడిగూడ/రాంనగర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ పోరాటంలో ప్రాణాలు కోల్పోయిన మాదిగల గుర్తుగా జూలై 7వ తేదీని అమరవీరుల సంస్మరణ దినంగా పాటించాలని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా వ్యవస్థాపక అధ్యక్షులు జన్ను కనకరాజు మాదిగ, తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఇటుక రాజు మాదిగ ప్రకటించారు. ఆదివారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. 30 ఏళ్ల వర్గీకరణ పోరాటంలో ప్రాణాలు కోల్పోయిన మాదిగ అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా జన్ను కనకరాజు మాదిగ, ఇటుక రాజు మాదిగ మాట్లాడుతూ, అమరవీరుల కుటుంబాలకు తెలంగాణ ప్రభుత్వం 250 గజాల ఇంటి స్థలం ఉచితంగా ఇవ్వాలని, కుటుంబంలో అర్హులైన వారికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ప్రతీ దళితకుటుంబానికి రూ. 12లక్షల ఆర్థిక సహాయాన్ని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అభయ హస్తంలో అందజేయాలని అన్నారు. మందకృష్ణ మాదిగ చేసిన పోరాటాలు రెండుసార్లు చంద్రబాబును, ఒకసారి రేవంత్‌రెడ్డిని ముఖ్యమంత్రులుగా, నరేంద్రమోదీని ప్రధానిగా చేయడమే తప్ప, ఆయన వలన మాదిగలకు ఎలాంటి న్యాయం జరగలేదని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉండే పార్టీలకు మద్దతు ఇచ్చి వర్గీకరణను సాధించుకుంటామని వారన్నారు.



లోయర్ ట్యాంక్‌బండ్ వద్ద అమరవీరుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జన్ను కనకరాజు మాదిగ తదితరులు

కార్యక్రమంలో అణగారిన ప్రజల హక్కుల పోరాట సంఘం అధ్యక్షుడు సీఎల్ యాదగిరి, తెలంగాణ మాదిగ హక్కుల దండోరా ఉపాధ్యక్షుడు సురేష్, టీఎమ్మార్పీఎస్ నేత జానయ్య, నగర అధ్యక్షుడు కొమ్ముకృష్ణ, ఇటుక గోపీ తదితరులు పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా రాంనగర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ ముషీరాబాద్ ఇన్‌చార్జిగజ్జెల రాజశేఖర్, నాయకులు నర్సింహరావు, దుర్గాప్రసాద్, రాజు, కుమారస్వామి, రమేష్ తదితరులు ఎమ్మార్పీఎస్ జెండాను ఎగురవేశారు.

దేశానికి ఇనాక్ రచనలు అవసరం: దత్తాత్రేయ

చిక్కడపల్లి, జూలై 7(ఆంధ్రజ్యోతి): సమాజ నిర్మాణ సంస్కరణాత్మక సాహిత్యం ఇనాక్ రచనలు అని హరియాణ రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రఖ్యాత సాహితీవేత్త, శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితీ సమాలోచన సప్తాహం ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. గవర్నర్ దత్తాత్రేయ ముఖ్యఅతిథిగా పాల్గొని ఇనాక్‌ను సన్మానించి మాట్లాడారు. క్లిష్టమైన పరిస్థితులనుంచి ఉత్కృష్టస్థానానికి ఎదిగిన ఇనాక్.. పరుల శ్రేయస్సుకోసం సాహిత్య సేద్యం చేశారని ప్రశంసించారు. సామాన్య దళిత కుటుంబంలో ఎనభై ఆరేళ్ళ క్రితం జన్మించి అప్పటి పరిస్థితులకు ఎదురీది మనుష్యులపై ప్రేమను తన సాహిత్యంలో చూపిన ఇనాక్ విశాల భావాల రచనలు దేశానికి అవసరం అన్నారు. సాహిత్యం, సమాజాన్ని కలిపి ఐక్యపరిచేవిధంగా ఉండాలే కానీ కులం మతం పేరిట విడగొట్టరాదని ఆయన పేర్కొన్నారు. ఆచార్య ఇనాక్ మాట్లాడుతూ నా కన్నీళ్లు నా సాహిత్యం భాష కష్టాలు ఆకలి బాధలు పడుతున్న జీవులే తన రచనకు ప్రేరణ అన్నారు. ప్రముఖ నాటక రచయిత విజయభాస్కర్ ఈసందర్భంగా ఇనాక్ అనువాద సాహిత్యంపై మాట్లాడుతూ భారతీయ సమగ్ర సాహిత్య స్వరూపం ఇనాక్ రచనలు అన్నారు. ఇనాక్ తన రచనలు దళిత సాహిత్యంగా చెప్పలేదని బాధలు పడే కన్నీళ్ళు వేదనలు అనుభవించే వారి పక్షం అని చెప్పారని అన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షత వహించిన సభలో ఉపాధ్యక్షుడు జంగంరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంయుక్త శిష్యబృందం గానగోష్టి ఆకట్టుకుంది.


ఆచార్య ఇనాక్‌ను సన్మానిస్తున్న హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ